# ★ శీలరక్షణ! ★

శ్రీమతి సుగుణ అగస్త్యగారు

ప్రసాదరావు రాజమండ్రిలో కలక్టరు కచ్చేరిలో ఒక గుమాస్తా. జీతం కొద్ది అయినప్పటికీ, భూవసతుదారులైనందున సంసారము నిరాటంకముగా గడచిపోవుచున్నది. అతనిభార్య యశోదమ్మ. పెద్దదైనను చదువుకొన్నది. చాల ఉత్తమురాలు, నిరాడంబరి. వారి సంతానము ముగ్గురు కుమార్తెలు. కుమార్తెలు జానకి, అహల్య, వీణ. పెద్దవారిద్దరు స్కూలుఫైనలువరకు చదివిరి. ఆ పైన వారిరువురకు మంచి సంబంధములను చూచి పెండ్లిచేసెను. జానకిని ఎత్తెత్తి ఎంగిలాకుమీదవేసినట్లు ఒక గోపికాలోలునకు యిచ్చెను. కాని భార్యయందు మాత్రము గాఢానురాగుడు రామమోహనరావు. ఆ వూరిలోనే బ్యాంకులో గుమాస్తా. వారి సంతానము యిరువురు కుమారులు. అహల్య పెనిమిటి జనార్దనరావు. గవర్నమెంటు డాక్టరు. ప్రస్తుతం తిరునల్వేలిజిల్లా ఆసుపత్రిలో పనిచేయుచున్నాడు. సంతానప్రాప్తి యింకను లేదు. చాల బుద్ధిమంతుడు. వీణ యింకను రాజమండ్రి గవర్నమెంటు హైస్కూలులో స్కూలుఫైనలు క్లాసులో చదువుతున్నది. బాల్యమందున్నను, చదువుకొనుచున్నను, యింటివద్ద తల్లికి సహాయముచేయుచూ, మహిళాసభలందతి శ్రద్ధతో పాల్గొనుచూ తలిదండ్రుల కల్లారుముద్దుగ పెరుగుచుండెను. కాని, సంఘముపేర తిరిగెడు పల్లేరుకాయలకు మాత్ర మీ కుటుంబమనిన అసూయ. అవుసరమయినప్పుడు అందరకూ మహానుభావులే వీరు.

జానకీ రామమోహనులు అనుకూల దంపతులేయైనను, రామమోహనుని వైఖరినిచూచి వీణ అసహ్యించుకొనునదే కాక, వివాహమందే నిరసనభావము చూపించెను. యీ కారణమున రామమోహను యింటికివచ్చినప్పుడు అయిష్టముగా వుండి తరచు సూటీపోటీ మాటలు అతనిపై విసురుతూ వుండు టామె కలవాటు. ఆ కారణమున ఎప్పటికైనను యీమెపై కసితీర్చుకొనవలెనని దీక్ష వహించెను. ఏ విషయమందు వీణపై ఆగ్రహించనితల్లి యీ విషయమందు మాత్ర మామెను మందలించుచుండును. జానకికిగూడ వీణయం దసూయభావ మేర్పడెను. ఎంత దుర్మార్గులైనను భర్తను నిందించినవారిపై ఆగ్రహ మొందుట భార్యలకు సహజమే కదా. వీణ యౌవనమందుండి అసమాన సౌందర్యరాశియై- పెక్కు మందికి భ్రాంతి కలిగించి గిలిగింతలు పెట్టుచుండెను. జానకికిగూడ తల్లి రూపు రేఖావిలాసములలో భాగముండినను కొద్దిగా వయస్సు మీరియుండుటచేతను, సంతానావస్థచేతయున్నూ వీణకు లొగ్గె. తన భర్తను వీణ వలపులో వేసుకొనునేమో యను భీతిని కౌగలించుకొనెను. యీ కారణమున అక్కచెల్లెళ్లిరువురకు తరచు కలహములు వాటిల్లుచుండెను. కాని ప్రసాదరావు బుద్ధికుశలత, చలోక్తి వారిని సమాధానపరచుచుండెను.

అహల్యా జనార్దనలు వీణను చాల ప్రేమగా చూచుచుందురు. వారిద్దరకు ఏ లోటు లేకున్నను, సంతానహీనులై పలుమంది హేళనకు లోనగుచున్నారు. ఛాయమ్మ ప్రసాదరావుకు చాల దూరపు బంధువు. భర్త దేశాంతరగతుడై పది సంవత్సరములు కావచ్చును. కాని ఆమెకు అటువంటి వ్యసనమేమియు లేకుండా వుల్లాసంగా జీవితం గడుపుచుండెను. ఆ పైన యింటింటికి తిరిగి యిచ్చకపుమాటలాడి తగవులు తెచ్చిపెట్టుటలో ఆరితేరినది. ముఖ్యముగా ప్రసాదరావుగారి కుటుంబమున కీమెను చూచిన పరమాసహ్యం. జానకికి మాత్రం యీమె స్నేహితురాలు. రామమోహను ఎక్కడెక్కడకు వెళ్లెనో, ఎవరెవరితో మాట్లాడెనో యీ సమాచారమంతయూ చెప్పుచుండుటచే చాల మంచిదనియు, తన యెడల సానుభూతి చూపుచున్నదనియు ఆమె యూహ.

వరలక్ష్మీ వ్రతం బహు వైభవంగా జరిపి వీణ అందరి మెప్పు వడసెను. ఒక్కవూరిలో వున్నను, అక్కచెల్లెళ్లిద్దరు కలసి చేసుకోవచ్చునని తండ్రి ఎంత చెప్పినను, జానకి వేరే

చేసుకొనెను. పేగింటముఖకువచ్చిన ముత్తయిదువులందరు వీణను చూచి ఆశంసించి, ఆమెను చేసుకొనే వరు డెంతటి యదృష్టవంతుడో యని అనుకొనసాగిరి.

ఇట్లే కొన్ని మాసములు గడచెను. పరీక్షలుజరిగెను. వీణ ప్రథమ తరగతియం దుత్తీర్ణురా లయ్యెను. తలిదండ్రులు వివాహ ప్రయత్నములు చేయసాగిరి. కాని వీణకు అంత ఉత్సాహముగా లేదు. యింకను చదువు సాగించవలెనని ఆమెయాశ. కాని తల్లిదండ్రుల కెదురు చెప్ప నిష్టపడక వూర కుండెను. ఒకనాటి మధ్యాహ్నము ప్రసాదరావు, యశో దమ్మ వీణ సంబంధవిషయమై పెండ్లివారింటికి వెళ్లిరి. వీణ ఒంటరిగా యింటివద్ద నుండెను. యింతకుముం దెన్నిపర్యా యములో ఆమె ఒంటరిగా వుండుట తటస్థించినను- భీతి నొందలేదు. యీ మా రెందుకో ఆమె భయపడసాగెను. తన మనస్సు కుదుటపరచుకొనుటకు వీణను తీసి వాయించు కొనసాగెను. కొంతసేపయిన పిమ్మట తలుపు తట్టినట్లు విన బడెను. తలమీద పిడుగుపడినట్లు ఆమె తలుపుతీసి చూచు నప్పటికి రామం (రామమోహను) ప్రత్యక్షం.

యిద్దరు పెనుగులాడిరి. వీణ ఎంత పెనుగులాడినా ప్రయోజనము లేకపోయెను. యింత నీచస్వభావుడనియు, తన శీలము భంగపరచుననియూ ఎప్పుడూ అనుకోలేదు. పాపం వీణ వెక్కి వెక్కి ఏడ్చుచుండెను. తన జీవితం అధోగతి పాలయ్యెనని కుమిలిపోవుచుండెను. యీ లోపున యశోదమ్మ యింటికి తిరిగివచ్చెను. కూతురిఅవస్థ చూచి తెల్లబోయెను. ఎంత అడిగిననూ తన విచారమునకు కారణం చెప్పలేదు. బ్రతిమాలగా, బ్రతిమాలగా చివరకు సంగతంతయు చెప్పెను. ప్రసాదరావుకూడ వచ్చి సమాచారమంతయు తెలిసికొనెను.

ప్ర:— హా! ఎంత ధారుణము. యింతకూ మేమూ పశువులం. నిన్నొంటరిగా విడిచిపెట్టుట మాదే తప్పు.

య:— అయినా నువ్వు అగ్గివంటి దానివి కదా. తగ్గినట్లు బుద్ధి చెప్పలేకపోయినావా—తల్లీ.

వీ:— పై మనిషి అయితే నేను కరచి వదలిపెట్టే దానినే - ముఖంమీద వుమ్మేదానినే - కాని - బావ అసా ధ్యుడు. అక్కకు కోపం వస్తుంది. వా డేమి చేసినా, వాడే తప్పంటుంది. యిక నా బ్రతుకేమిగాను?

య:— వూరుకోమ్మా మేము చూస్తాము లే - నీ తప్పే ముంది. యిది పైకి రాకుండా కాపాడుకొనే బాధ్యత మనది. నువ్వుమాత్రం ధైర్యంవహించు తల్లీ. ఏ మాత్రం మార్పున్నా లోకులు గ్రహిస్తారు.

ప్ర:— ఛీ. దుర్మార్గుడా. నేనే దగ్గరుంటే చంపే వాడినే. వాడికి బుద్ధిలేదూ పెండ్లికాని పిల్లను చెరచటానికి. నా కూతురు ఒక్కర్తె చాలదూ. యిద్దరు కావలెనా. దానికి మన మిప్పు డేమిచేయగలము. ఎవరింటికైనా పంపించినా బాగుండేది. వాడినేం చేసినా పాపంలేదు. మాకే ద్రోహం చేస్తావా - పాపాత్ముడా.

య:— వూరుకోండి యింక. దానిని ఓదార్చండి. తరువాత నెమ్మదిమీద ఆలోచించవచ్చును.

వీ:— ఏ మాలోచిస్తారు. యింత జరిగిన తరువాత నే నెలా పెండ్లిచేసుకొనేది. మీరే ఆలోచించండి. మోసం చేసినట్లు గదా. యీ సంగతి ముందే చెప్పలేము గదా. నేను ట్రెయినింగు చదువుకొని వుద్యోగం చేసుకుంటాను. బాగా ఆలోచించండి.

ప్ర:— మేము అలాగే ఆలోచిస్తాము లే. యిప్పుడు లేచి ముఖము కడుక్కో. ఎలా వాచిందో చూడు ముఖం. లే. ఎవరైనా వస్తారు మళ్లీ.

ఆ రాత్రికి దంపతులిద్దరు బాగా ఆలోచించుకొని, వీణ ఆలోచన బాగుగానే వున్నదని సమాధానపడి - ఏమైనను ఒక సంవత్సరము విశ్రాంతి యిచ్చుటకు ఏర్పరిచిరి. కాని అంత సులభముగా కుదిరిపోవునా - రామమోహను ప్రతిజ్ఞ నెరవేరెనా అనినట్లు - వీణకు తగని అవస్థ సంభవించెను. యీ పరాభవ మెట్లు భరించగలరు. లోకమంతా వ్యాపించదా. నివృత్తి చేయుటకు వీణ అంగీకరించలేదు. ప్రాణ హత్య కాదా. మాన మర్యాదలకొరకు ఒక ప్రాణమును తీయుటయేనా. ఏ వుపాయమూ లేకపోయిననాడు- రామం కుచితబుద్ధి వెల్లడిపరచి- పరువును పోగొట్టి- తాను కన్యగా

వుండిపోయి, తన బిడ్డను గౌరవంగా పెంచి పెద్దవానిని చేయ ప్రసాదంవు కోక ఆలోచన తట్టెను. అందుచేత రహస్యముగా అహల్యను, జనార్దనరావుకు సెలవుమీద రమ్మని వుత్తరము వ్రాయగా, వారిరువురు తక్షణమే బయలుదేరి వచ్చిరి. బహు రహస్యముగా సంభాషణలు జరిగెను. జానకికి గూడ తెలియచేయలేదు. జనార్ధనకూడ చాల దూరాలోచన కలవాడు. తన కింతమట్టుకు సంతతిలేదు. మామగారి ఆలోచన గ్రహించి సంతోషపడెను. అహల్య గర్భిణీ అయినట్లు, వివాహానంతరము చిరకాలమునకు వచ్చినందున పెద్ద ఆసుపత్రిలో జరుపుటకునూ, తాను దగ్గరగా వుండుటకునూ, వీలగునట్లు దూరముననున్న సంస్థానపు ఆసుపత్రిలో వుంచుటకునూ, సహాయముకొరకు వీణను తీసుకు వెళ్లునట్లునూ ఏర్పాటు చేసిరి.

జనార్దనరావు వీణను ఎప్పుడూ సంతోషముగా వుంచుటకై అనేక విధముల నవ్వించుతూ, ముగ్గురూ ఆట పాటలతో కాలము గడుపుతూ వచ్చిరి. గర్భము పరిపక్వమై ఒక సుముహూర్తమున ఆడ శిశువు జనించెను. ఆదినుండియు బిడ్డకు పై పాలే గతియైనది. పది రోజులు ఆసుపత్రిలో గడచిన పిమ్మట అందరు యింటికి తిరిగివచ్చిరి. యధావిధిని నెలలోపున నామకరణము జరిగెను. బిడ్డకు "జయంతీ"యను నామంబిడిరి. జనార్దనరావు డాక్టరైనందున, చికిత్స స్వంతముగా గడచెను. జయంతికి తమ స్వంత బిడ్డకంటె ఎక్కువ గారాబముతో పెంచెదరనియూ, ఏ విధమైన లోటు కలుగనీయరనియు, బిడ్డపై వీణ అధికవాత్సల్యము చూపరాదనియు షరతులు వేయబడెను. కాని వీణమాత్రం మాతృప్రేమ నణచుకొనుటయందు చాల దుఃఖపడవలసి వచ్చెను. కన్నబిడ్డలయందు అనురాగము చూపకుండుటెట్లు? భర్తకంటెను బిడ్డ లెక్కువగదా. తనబిడ్డపై తన అక్క, బావ చూపు వాత్సల్యముచూచి ఓర్వలేక పోయేది. కాని ప్రపంచమునకు వెరచి అన్నియు దిగమ్రింగి యధాప్రకారం తిరుగుచుండి ఒక దినము నలుగురు పయనమై రాజమండ్రి వెళ్లిరి. బిడ్డను తాతా అవ్వలకు చూపి తిరిగి అహల్య, జనార్దనులు జయంతీ సమేతుల్తై తమ స్థానికి వెళ్లిరి. జానకికి మాత్రం యిదిఅంతయూ పద్మవ్యూహంవలె వుండెను. తన కిద్దరు బిడ్డలు పుట్టిరిగదా. ఎప్పుడూ యింతశ్రద్ధ వహించలేదే. అహల్య పురిటికెందుకు కీహడావుడి. వీణ ఎందుకు వెళ్లవలెను. పుట్టినాటికి రాకూడదా అని అనేకవిధము లాలోచించి యిటీవల తనమీద వ్యామోహము తగ్గినట్లు దురభిప్రాయపడెను. కాని ఏమిచేయగలదు. వీణ ట్రెయినింగు తరగతియందు ప్రవేశించెను. తరుచు మనస్పర్థలతో సంవత్సరము గడచెను. వీణ ట్రెయినింగు పరీక్షయందు త్తీర్ణురాలై, ఒక వుద్యోగము సంపాదించి రాజమండ్రిలోనే స్వగృహమందుండెను. జయంతికిగూడ సంవత్సరము నిండెను. జయంతి తాతగారింటికి వచ్చి ప్రథమ జన్మదినోత్సవమును మహా వైభవముగా జరిపించుకొనెను. వీణ యిచ్చిన కానుక లిన్నియని చెప్పుటకు వీలుగాదు. మాతృవాత్సల్యము గాదు. ఆడపిల్లలందు వాత్సల్య మెక్కువను మిషతో రోజంతయు జయంతితో గడుపుచుండేది. 'మూడు మూర్తులా పినతల్లి పోలికేనమ్మా'యని యిరుగు పొరుగువారంటూవుంటే, వీణకు వుక్కిరిబిక్కిరిగా వుండేది.

జయంతి గారాబంగా పెరిగి తేనె పలుకులు నేర్చింది. "పిన్నీ నువ్వంటే నాకు చాల యిష్టము. అమ్మకూడ యిష్టమే గాని, నువ్వు యింకా ఎక్కువ"అని అంటూవుంటే వీణ పరవశమయిపోయేది. యిదంతా తనపాపమునకు ప్రాయశ్చిత్త మనుకునేది.

ఆహా-ఏమి ఆ తలిదండ్రుల యోగ్యత. ఓర్పు-ప్రేమ-ఎంత మంది తమ బిడ్డలను ఆ విధంగా రక్షించుచున్నారు? న్యాయాన్యాయములు విచారించుచున్నారు. దూరాలోచనయే వుండుటచేతనే కదా. వీణ సంఘ బహిష్కారము నుండి రక్షింపబడినది. లోకులనిందకు గురిగాకుండా జయంతి సాధారణ యువతి కాగలిగినది.

ఇట్టి వెన్నియో లోకంలో జరుగుచుండవచ్చు. పెద్దలు, వీటి మూలకారణముల నారసి, నిర్మూలించుట సంఘమునకు శ్రేయస్కరమని మనవి.

★